## విజ్ఞాన శిబిరం అద్భుత అవకాశం

నస్పూర్, ఏప్రిల్ 25 : వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు అద్భుత అవకాశమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. నిత్య జీవితంలో మన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సైన్స్ కారణాలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి ఆలోచనా శక్తి పెంపొందించుకునేలా ఈ క్యాంపును వినియోగించుకోవాలని సూచించారు. వేసవి సైన్స్ శిబిరం అభినందనీయమని పేర్కొన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు మాట్లాడుతూ.. మొత్తం 186 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 120 మందికి అవకాశం కల్పించామన్నారు. డీఈవో యాదయ్య, జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈవో మలావీ దేవి, విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు సత్యనారాయణ, కోడింగ్ సెన్సార్ నిపుణులు సాల్మన్ జోన్స్, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, మూర్తి, నాగవర్మ, రాజేశం, తిరుపతి, జిజ్ఞాస సభ్యులు లక్ష్మణ్, సంపత్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్కే-7 గని 50 వసంతాల వేడుక



శ్రీరాంపూర్ : ఆర్కే 7గని వేడుకల్లో డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గని 1975లో మొదలై.. 49 వసంతాలు పూర్తి చేసుకొని 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అధికారులు, కార్మికులు శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గని మేనేజర్ జెంగిలి తిరుపతి ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ, ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిరంజీవి, జీఎం శ్రీనివాస్, ఏజెంట్ రాజేందర్ గనిపై మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గనిపై శాంతి హోమం నిర్వహించారు. అనంతరం కార్మికుల సమక్షంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అన్నదానం చేశారు. రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంత్ సాహూ, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి మారపెల్లి సారయ్య, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, కేంద్ర కార్యదర్శి పానగంటి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ శ్రీధర్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, శ్యాంకుమారస్వామి, టీబీజీకేఎస్ నాయకులు రాజునాయక్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్, ఏప్రిల్ 25 : 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇందారం ఓపెన్‌కాస్టును శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో సందర్శించారు. లక్ష్యాల సాధనకు ప్రణాళికతో ముందుకెళ్లాలని, కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలని సూచించారు. మట్టి తవ్వకాలు చేపడుతున్న వరహా కంపెనీ సిబ్బందితో మాట్లాడారు. ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజినీర్ రామక్రిష్ణారావు, సర్వే అధికారి రామ్మోహన్, రక్షణాధికారి సతీశ్, వరహా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన కోసం కబడ్డీ టోర్నీ

తాండూర్, ఏప్రిల్ 25 : యువత చైతన్యవంతులైతేనే డ్రగ్స్‌ను శాశ్వతంగా పారదోలవచ్చని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. యాంటీ డ్రగ్స్ అవేర్నెస్‌పై తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో సీఐ కుమారస్వామి అధ్యక్షతన సర్కిల్ కార్యాలయ ఆవరణలోని మైదానంలో బెల్లంపల్లి సబ్ డివిజనల్ స్థాయి కబడ్డీ టోర్నీని శుక్రవారం ఏసీపీ రవికుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మాదక ద్రవ్యాలు విడనాడి జీవిత గెలుపును ఆస్వాదించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయంగా యువత తమ లక్ష్యాలను ఛేదించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్, మాదారం, కన్నెపల్లి, భీమిని ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, గంగారాం, విజయ్, బెల్లంపల్లి సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 25 : చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ తనిఖీ చేశారు. సిబ్బందితో మాక్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ దేవేందర్ రావు, ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలు

మందమర్రి, ఏప్రిల్ 25 : మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఈ నెల 28, 29, 30వ తేదీల్లో 54వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ సౌజన్యంతో నిర్వహించే ఈ పోటీల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 20 మంది సీనియర్ మహిళా క్రీడాకారులను ఎంపిక చేసి, శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి అలుగువెల్లి రమేశ్ రెడ్డి, కోచ్ సోనార్కర్ అరవింద్, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, సభ్యులు కర్ర మహేందర్ రెడ్డి, ఎగ్గెటి రాజేశ్వర్ రావు, రాజమౌళి పాల్గొన్నారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 25 : మంచిర్యాల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి హరీశ్ రాజ్ పాల్గొని, అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. దోమలు పెరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, ఆదేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, ప్రోగ్రాం అధికారి అనిల్ కుమార్, వైద్యులు శివప్రతాప్, అశోక్, సునిత, అమర్, రాము, రజిత, ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది, డీపీవో ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారులు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వాంకిడి,ఏప్రిల్ 25 : దోమల వ్యాప్తిని నిరోధిస్తే వ్యాధులు నియంత్రణలోకి వస్తాయని, ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యుడు వినయ్, వైద్యురాలు రిషిక పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాంకిడి ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆరోగ్య కేంద్రం నుంచి స్థానిక బస్టాండ్ చౌరస్తా వరకు ఆరోగ్య సిబ్బంది ర్యాలీ తీశారు. ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల, ఏప్రిల్ 25 : నెన్నెల ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ తీశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డాక్టర్ లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థల పరిశీలన

కౌటాల, ఏప్రిల్ 25 : మండల కేంద్రంలోని కుమ్రం భీం కమిటీ హాలు ఎదుట గల స్థలం వివాదాస్పద స్థలాన్ని ఎంపీడీవో బుద్దె రమేశ్, ఎస్ఐ గుంపుల విజయ్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడి దుకాణాలను తొలగించాలని ఇటీవల ఆదివాసులు మండల అధికారులకు వినతి పత్రాలు అందచేశారు. కాగా, 28 ఏళ్లుగా రోడ్డుపక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటున్నామని, తమ జీవితాలను ఇబ్బంది పెట్టవద్దని, న్యాయం చేయాలని బాధితులు మండల అధికారులతో పాటు, సబ్ కలెక్టర్, కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ విషయంపై ఎంపీడీవో, ఎస్ఐ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి సుబ్బ సాయికృష్ణ, తదితరులున్నారు.

## 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నస్పూర్, ఏప్రిల్ 25 : కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం పేర్కొన్నారు. మంచిర్యాలలో శుక్రవారం ఆయ మాట్లాడారు. కన్నయ్య మృతిచెంది 20 రోజులు గడుస్తున్నా బాధిత కుటుంబాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. బాధితురాలు నాయిని స్వరూప, నాయకులు శంకర్, పోశం, రాజేశ్వరి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభపై విస్తృత ప్రచారం



భీమారంలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, నాయకులు

మందమర్రి, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభపై మందమర్రి మున్సిపాలిటీలో పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధి శాంతినగర్, గాంధీనగర్ కాలనీల్లో పార్టీ జెండా గద్దెలను రంగులతో అలంకరిస్తున్నారు. చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ స్వయంగా జెండాలకు రంగులు వేశారు. అలాగే యాపల్ ఏరియాలో వాల్ పోస్టర్లను విడుదల చేసి, వీధుల్లో పార్టీ నాయకులతో కలసి పోస్టర్లు వేశారు. పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి సభకు ఆహ్వానించారు. శనివారం సాయంత్రం పట్టణంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ తీయనున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, బత్తుల శ్రీనివాస్, కొంగల తిరుపతి రెడ్డి, బండారు సూరిబాబు, బోరిగం వెంకటేశ్, ఎండి.అబ్బాస్, మద్ది శంకర్, కనకం రవీందర్, పూసాల ఓదెలు, బర్ల సదానందం, రామసాని శేఖర్, భీమయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి సీపెల్లి సాగర్ పాల్గొన్నారు.

భీమారం, ఏప్రిల్ 25 : రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ భీమారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు వాల్‌పోస్టర్లను విడుదల చేసి, ఆవిష్కరించారు. చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, మండలాధ్యక్షుడు కలగూర రాజ కుమార్, నాయకులు సమ్మయ్య, రాజేశ్వర్‌రెడ్డి, లాజర్, రాము, శ్రీకాంత్, గోపాల్, రాజు, రాజ్ కుమార్, ప్రణీత్ గౌడ్, మణిదీపక్, రాజమల్లు, లచ్చన్న పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, ఏప్రిల్ 25 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో వాల్ పోస్టర్‌ను రాజా రమేశ్ ఆవిష్కరించారు. ప్రతీ గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి సభ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోడలపై వాల్ పోస్టర్లు, వాహనాలకు స్టిక్కర్లు అంటించారు. గ్రామ అధ్యక్షుడు సిద్ధం వెంకటేశ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, జంపయ్య, నాయకులు వెంకటేశ్, నారాయణరావు, రమేశ్, చిరంజీవి, సుగుణాకర్‌రావు, బాపు, శంకర్, సతీశ్ పాల్గొన్నారు.



రెబ్బెన : గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట..



మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట బైఠాయించిన టీబీజీకేఎస్ నాయకులు

# సమస్యలపై టీబీజీకేఎస్ దశలవారీ పోరాటం

రెబ్బెన, ఏప్రిల్ 25 : సింగరేణిలోని సమస్యలపై టీబీజీకేఎస్ దశలవారీ పోరాటాలు చేస్తుందని బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు అన్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం జీఎం విజయభాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఏరియాలోని గోలేటి ఓసీపీ త్వరగా ప్రారంభించాలని, ఏరియాలోని మదారంలో మంచినీటి ఎద్దడి నివారణా చర్యలు తీసుకోవాలని, గోలేటి, మదారంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని, రామగుండం రీజియన్‌లో కార్మికులకు స్వచ్ఛమైన మంచినీరు సరఫర చేయాలని, అండర్ గ్రౌండ్ గనులు, ఓపెన్‌కాస్ట్‌లలో ప్రైవేటీకరణ పూర్తిగా నిలిపివేయాలని, సింగరేణికి నూతన గనులు కేటాయించాలని, కార్మికులు, కుటుంబ సభ్యులను సూపర్ స్పెషాలిటీ దవాఖానకు పంపే రెఫరల్ విధానం సమీక్షించి, మెరుగైన విధానం అమలు చేయలని, మెడికల్ కార్డులు అందించాలని, గనులకు వేలం వేసే ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ధరావత్ మంగీలాల్, మారిన వెంకటేశ్వర్లు, కార్నాథం వెంకటేశం, మాంతు సమ్మయ్య, గజ్జెల్లి చంద్రశేఖర్, అంబాల ఓదెలు, మెరుగు రమేశ్, బొంగు వెంకటేశ్, వంగ మహేందర్‌రెడ్డి లతో పాటు పలువురు ఉన్నారు.

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 : సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు ధర్నా చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లారు. అనంతరం జీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, కేంద్ర కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు ముత్యాల రమేశ్, సాధుల భాస్కర్, వెంగళ కుమారస్వామి, గొర్ల సంతోష్, పిట్ కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రాజు నాయక్, దుర్గం రవికుమార్, వికాస్, గడ్డం మల్లయ్య, సుధాకర్, నాయకులు రాంటెంకి మల్లయ్య, చాట్ల రమేశ్, తొర్రం శ్రీకాంత్, పానుగంటి వినయ్, వెంకట్‌రమణారెడ్డి, తిరుపతిరావు, పాదం శ్రీనివాస్, గడ్డం మహిపాల్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

మందమర్రి, ఏప్రిల్ 25 : మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది బయటకు వెళ్లకుండా గేటు ఎదుట బైఠాయించారు. అనంతరం ఏరియా జీఎం జీ దేవేందర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓ రాజశేఖర్, నాయకులు బడికెల సంపత్, సీహెచ్ వెంకటరమణ, దాసరి శ్రీనివాస్, తోట రాజిరెడ్డి, వీరారెడ్డి, కొండల్‌రావు, యుగేందర్, కొట్టె రమేశ్, బైరి శంకర్, తిరుపతి, బెల్లం అశోక్, హన్మంతరావు, దబ్బెట సంతోశ్, భిక్షపతి, అందె శ్రీకాంత్, సంగి రవి, ఉరేందర్, రంజిత్, అఫ్జలుద్దీన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో భారీ అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 25 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీ రోడ్డులోని శివశక్తి బేలింగ్ యూనిట్ ప్లాస్టిక్ గోదాంలో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గోదాంలో ఉన్న ప్లాస్టిక్, తుక్కు సామగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. గోదాం చుట్టూ ఉన్న ఇళ్లలోకి దట్టమైన పొగ వ్యాపించి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యజమాని అనుముల సతీశ్ కుమార్ సమాచారం మేరకు మంచిర్యాల ఫైర్ స్టేషన్ అధికారి రమేశ్‌బాబు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, గోదావరిఖని ఏరియాల నుంచి ఫైర్ ఇంజిన్లు తెప్పించి దాదాపు మూడున్నర గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.2.96 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

## భూ భారతిపై అవగాహన

బెల్లంపల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని కన్నాల రైతు వేదికలో భూ భారతిపై అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న పాల్గొన్నారు. అనంతరం బుధాఖుర్దు గ్రామంలో రేషన్‌కార్డు లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరవుతారని పెద్ద ఎత్తున ప్రచారం చేసినా, హాజరుకాకపోవడంపై రైతులు అహసనం వ్యక్తం చేశారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం మండలంలోని తాళ్లగురిజాల రోడ్డులోని ప్రభుత్వ స్థలాలను ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. డంప్‌యార్డు స్థలాన్ని కూడా పరిశీలించారు.

తాండూర్, ఏప్రిల్ 25 : భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. తాండూర్ మండల కేంద్రంలోని సురభి గోధా క్షేత్ర ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఏవో సుష్మ, నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 25 : భూ భారతి ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్సీ దండే విఠల్, మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో ఆల్బర్ట్, మండల వ్యవసాయ అధికారి మనీష, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కౌటాల, ఏప్రిల్ 25 : భూ సమస్యల పరిష్కారంలో భూ భారతితో ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో రమేశ్, ఎంఏవో ప్రేమలత, సీఐ రమేశ్, ఎస్ఐ విజయ్, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పాలకవర్గం ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రి, ఏప్రిల్ 25 : మందమర్రి మున్సిపాలిటీలో పాలకవర్గం ఎన్నికలు నిర్వహించి, అభివృద్ధికి పాటుపడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డప్పు రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సింగరేణిలో భూ గర్భగనులు ప్రారంభించి, ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పరిగొమ్మల ప్రేమలత, సీనియర్ నాయకులు రేణుకుంట్ల శ్యాంసుందర్, గుడికందుల తిరుపతి, మహమత్ ఖాన్, పులపాక శ్రీనివాస్, ధర్మపురి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 25 : జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కుమ్రం బీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండలంలోని అడదస్నాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల కోసం నీటి కుంట

జైపూర్, ఏప్రిల్ 25 : వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ ప్రాంతంలో నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. కాన్కూర్, ముదిగుంట గ్రామంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉపాధి హామీ ద్వారా ఏర్పాటు చేస్తున్న కుంటను సిబ్బందితో కలిసి పరిశీలించారు. అటవీ ప్రాంతంలో నీటి ఊటలు ఉన్న ప్రదేశాలను గుర్తించి, కుంటలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాచర్ శంకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ

నస్పూర్, ఏప్రిల్ 25 : మంచిర్యాల జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పూర్ణ చంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు.

## కౌటాల ఎంపీడీవోగా రమేశ్

కౌటాల, ఏప్రిల్ 25 : కౌటాల ఎంపీడీవోగా బుద్దే రమేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కోట ప్రసాద్ కాగజ్‌నగర్‌కు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో కాగజ్‌నగర్ ఎంపీడీవో రమేశ్ ఇక్కడికి వచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. మండలంలోని కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు.

## డీజేలతో బ్యాండ్ కార్మికుల ఇబ్బందులు

మందమర్రి, ఏప్రిల్ 25 : శుభకార్యాలు, సభల్లో డీజేల వినియోగం వల్ల బ్యాండ్ కార్మికుల కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని మ్యూజికల్ బ్యాండ్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఆధునిక సాంకేతికత పేరుతో శుభకార్యాలు, సభల నిర్వాహకులు ఈవెంట్ ఆర్గనైజర్లను సంప్రదిస్తున్నారని, డీజేలను వినియోగిస్తూ డప్పులు, మంగళ వాయిద్యాలు, బ్యాండ్ బృందాల అవసరం లేకుండా చేస్తున్నారన్నారు. సమస్యలపై పోరాడేందుకు పట్టణంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా రసూల్, ఉపాధ్యక్షుడిగా తాజుద్దీన్‌బాబ, కోశాధికారిగా ఎండీ అక్బర్‌బాషా, ఎండీ సలాం, సహాయ కార్యదర్శి వినోద్, సాయికృష్ణ, చోటుమియా, పడగల అఖిల్, ఎండీ సుకూర్, అబ్జల్, శశిధర్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

## 132 కేవీ సబ్ స్టేషన్‌లో ట్రయల్ రన్



టవర్ లైన్ ప్రారంభ పూజ చేస్తున్న సీఈ విజయ్ పాపారావు

కౌటాల, ఏప్రిల్ 25 : మండలంలోని తలోడి గ్రామ శివారులో నిర్మించిన 132 కేవీ సబ్ స్టేషన్‌లో టవర్ లైన్ విద్యుత్ సరఫరాలను శుక్రవారం సీఈ విజయ్ పాపారావు ఆధ్వర్యంలో ట్రయల్ రన్ చేశారు. ఈజ్‌గాం నుంచి తలోడి 132 కేవీ సబ్ స్టేషన్ వరకు టెస్టింగ్ విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఔట్‌గోయింగ్ సరఫరా ఇచ్చేందుకు సమయం పడుతుందన్నారు. ఎస్ఈ వెంకటేశ్వర్ రావు, ఎస్ఈ ఎన్‌పీడీసీఎల్ శేషరావు, ఈఈ కన్‌స్ట్రక్షన్ రవి కుమార్, డీఈ నాగరాజు, డీఈ ఓఎం గులాబ్ రాంటెంకి, ఏడీఈ కన్‌స్ట్రక్షన్ లక్ష్మీనారాయణ, ఏఈలు కన్‌స్ట్రక్షన్ శ్రీకాంత్, సాయి కిరణ్, సిబ్బంది ఉన్నారు..

## ఆధునిక యంత్రాలతో పనులు సులభం

మందమర్రి, ఏప్రిల్ 25 : ఆధునిక యంత్రాలతో పనులు సులభతరమవుతాయని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. ఏరియాలోని కేకేఓసీలో శుక్రవారం 40 టన్నుల సామర్థ్యం గల నూతన క్రేన్‌ను ఆయన ప్రారంభించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి సులభతరం చేసేందుకు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేకేసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఇంజినీర్ ఎన్ వంశీధర్, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీధర్ గౌడ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మర్రి కుమారస్వామి, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేశ్, ఏఐటీయూసీ ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 25 : మంచిర్యాలలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థిని లక్ష్మి ప్రసన్న మృతిపై విచారణ జరిపించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. విద్యార్థిని అస్వస్థతకు గురైన వెంటనే సంబంధించిన అధికారులు సకాలంలో స్పందించి ఉంటే లక్ష్మీప్రసన్న బతికేదని పేర్కొన్నారు. బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కార్, ఆర్గనైజర్ విజయ్ ఉప్రే, ఎస్ఎస్‌డీ, బాధ్యులు దుర్గం సందీప్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం మనోజ్, ఉప్రె రోషన్, సురేందర్, రమేశ్, జైపాల్, స్వాగత్, చంద్రమని, ప్రశాంత్, ప్రకాశ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాల ఆవిష్కరణ

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 25 : పట్టణంలోని బ్రాహ్మణ సేవాసంఘ భవనంలో బ్రహ్మశ్రీ కొమ్మెర దత్తుమూర్తి సిద్ధాంతి రచించిన యజుర్వేద వివాహ ప్రయోగ చంద్రిక, గోపాల సహస్రనామ స్తోత్రం పుస్తకాలను శుక్రవారం ఆవిష్కరించారు. పెద్దబూదెకు చెందిన బ్రహ్మశ్రీ రాంపల్లి నారాయణ శర్మ అవధాని, ఆదిలాబాద్‌కు చెందిన చికిలి వెంకటేశ్వర శాస్త్రి సిద్ధాంతి, శతావధాని ఎంవీ పట్వర్ధన్, గోవింద్ దేశ్‌పాండే, జక్కెపల్లి ముక్తేశ్వర్, కేవీయం ప్రకాశ్ రావు, కొమ్మెర రాజేశ్వర్ రావు, విశ్వేశ్వర రావు, బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేఎం శ్రీనివాస్ రావు, కే రాజేశ్వర్ రావు, శంకర్ శర్మ, దత్తాత్రేయ శర్మ, శంకర్, శ్రీమూర్తి, సురేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 25 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కుర్మపల్లి ఏరియాలో నస్పూర్ ప్రాంతానికి చెందిన ఎలిగేటి చంద్రయ్య-శాంత దంపతుల కొడుకు ఎలిగేటి నాగరాజు (30) గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేందర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు జిల్లా కేంద్రంలోని శ్రీరామ్ ఫైనాన్స్ ప్రైవేట్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం నుంచి ఆరోగ్య పరిస్థితి బాగోదని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ప్రమాదం జరిగిన చోట యువకుడి బైక్ ఉందని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించినటుల ఎస్ఐ తెలిపారు. తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 : లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రాబోర్ హర్ష హోటల్ ఎదుట శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన చెవుల రాజలింగయ్య (62) మృతిచెందినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజలింగయ్య కొడుకు లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రా బోర్, కూతురు గాంధీనగర్‌లో ఉంటున్నారు. శుక్రవారం తన బైక్‌పై ఉత్కూర్ చౌరస్తా నుంచి ఆంధ్రాబోర్‌లోని కొడుకుకు చెందిన టైర్ల దుకాణాకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుకాల నుంచి గుర్తుతెలియన కారు వచ్చి, ఢీ కొట్టింది. రాజలింగయ్యకు తీవ్రగాయాలవగా, కరీంనగర్ దవాఖానకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కొడుకు చెవుల మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పోలేరమ్మ ఆలయం వద్ద అగ్నిప్రమాదం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 25 : సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయ సమీపంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆలయం గేటు వద్ద పెద్ద ఎత్తున మంటల చెలరేగాయి. ఆలయానికి సంబంధించిన కర్రలు, సిరామిక్స్ పైపులు పచ్చని చెట్లు కాలిపోయాయి. ఆలయ కమిటీ సభ్యులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలను ఆర్పివేశారు. మున్సిపల్ డంపుయార్డు చెత్త ఆలయం చుట్టూ ఉండడంతోనే ప్రమాదం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. చెత్త ఇక్కడ పోయకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు సింహాచలం, అప్పారావు, బంగార్రాజు, దలాయి పాల్, ఈశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి ట్రాక్టర్ దగ్ధం

దహెగాం, ఏప్రిల్ 25 : వరి గడ్డి లోడుతో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలి దగ్ధమైన సంఘటన దహెగాంలో శుక్రవారం చోటు చేసుకున్నది. తెలిసిన వివరాల ప్రకారం.. కాగజ్‌పనర్ మండలం బోడెపల్లికి చెందిన కావిడె గోపాల్ దహెగాంలోని ఓ రైతు పొలం వద్ద ట్రాక్టర్‌లో వరిగడ్డి లోడ్ చేసుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ ట్రాక్టర్ నుంచి కిందికి దూకాడు. మంటలు పెద్ద మొత్తంలో వ్యాపించడంతో గడ్డితో పాటు ట్రాక్టర్ కాలిపోయింది.

## ఫారెస్ట్ బీట్ అధికారిణి మృతి

కోటపల్లి, ఏప్రిల్ 25 : కోటపల్లి మండలం అన్నారం ఫారెస్ట్ బీట్ అధికారిణి తగరం ప్రసన్న (30) అనారోగ్యంతో మృతి చెందింది. విధులపై చురుకుగా ఉండే ప్రసన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. కాగా, ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు సంతాపం ప్రకటించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 : పట్టణంలోని ఆంధ్రాబోర్‌లో గల ఎయిర్టెల్ టవర్ ఏరియాలో గురువారం రాత్రి చోరీ జరిగినటుల సీఐ నరేందర్ తెలిపారు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీలో పని చేస్తున్న బొప్పు శ్రీనివాస్ గురువారం తన ఇంటికి తాళం వేసి వెంకట్రావుపేటలో ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా, తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, రెండున్నర తులాల బంగారు గొలుసు, 20 తులాల వెండి, రూ. 35 వేలు దుండగులు దోచుకెళ్లారు. ఎస్ఐ గోపతి సురేశ్, తమ సిబ్బందితో పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 25 : చెన్నూర్ మండలం లంబాడిపల్లి గ్రామంలోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం చెన్నూర్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి సిద్ధం చేసిన 2వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 8 లీటర్ల గుడుంబా, 10 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సరైన పత్రాలు లేని 50 బైకులకు జరిమానా విధించారు. ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మినీ జాబ్ మేళాలో ఉద్యోగాలు

మంచిర్యాల, (ఏసీసీ), ఏప్రిల్ 25 : తమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మిమ్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని మంచిర్యాల జిల్లా ఉపాధి శాఖ అధికారి రవికృష్ణ శుక్రవారం తెలిపారు. 80 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా, 18 మందికి శ్రీ విజయ బయో ఫెర్టిలైజర్స్ కంపెనీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు. కళాశాల ప్రతినిధులు, శ్రీరాం లైఫ్ ఇన్స్యూరెన్స్, శ్రీ విజయ, మణప్పురం హోం ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇద్దరికి ఆరు నెలల జైలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 25 : మూడు చెక్‌బౌన్స్ కేసుల్లో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు, తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నిరోష శుక్రవారం తీర్పునిచ్చినట్లు కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మందమర్రిలోని గద్దెరాగడికి చెందిన గుమ్ముల శ్రీనివాస్, తన అవసారాల నిమిత్తం మంచిర్యాల ఏసీసీ సుభాష్‌నగర్‌కు చెందిన గుమ్ముల చంద్రశేఖర్ వద్ద రూ.5 లక్షలు, గుమ్ముల వెంకటేశ్వర్లు వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో 2017లో వారు కోర్టును ఆశ్రయించారు. అలాగే మంచిర్యాల ఏసీసీకి చెందిన బీ రజిత, తన అవసరాల నిమిత్తం మంచిర్యాలకు చెందిన ఎం తిరుపతి వద్ద రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నది. తిరిగి చెల్లించకపోవడంతో 2018లో కోర్టును ఆశ్రయించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు.

## పీఈటీల నియామకానికి దరఖాస్తులు

మందమర్రి, ఏప్రిల్ 25 : మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ క్రీడల్లో వేసవి శిక్షణ ఇచ్చేందుకు పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ శుక్రవారం తెలిపారు. మందమర్రి, రామకృష్ణాపూర్, సోమగూడెం, బెల్లంపల్లికి చెందిన ఆసక్తి గలవారు 28వ తేదీలోగా పర్సనల్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని కోరారు.